నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 16 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

కొనుగోలు సెంటర్ వద్ద ఆరబెట్టిన ధాన్యం

# తూకం.. జాప్యం

## నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- లక్ష్యం సుదూరం.. కొనుగోళ్లు నామమాత్రం
- కొనాల్సింది 1.38 లక్షల మెట్రిక్ టన్నులు
- గద్వాలలో కొన్నది.. 47 వేల మెట్రిక్ టన్నులు
- కేంద్రాల వద్ద రైతులకు తప్పని పడిగాపులు
- వేధిస్తున్న గన్నీ బ్యాగులు, హమాలీల కొరత
- అకాల వర్షాలతో అల'జడి'

చేతికొచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యం సుదూరం ఉంటే.. కొనుగోళ్లు మాత్రం నామమాత్రంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో సేకరణకు టార్గెట్ 1.38 లక్షల మెట్రిక్ టన్నులు నిర్ధేశించగా.. ఇప్పటి వరకు కొనుగోలు చేసింది కేవలం 47 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే.. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు సెంటర్ల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదు. పలు చోట్ల గన్నీ బ్యాగులు, హమాలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. దీనికి తోడు వాతావరణం రైతులను బెంబేలెత్తిస్తున్నది. అకాల వర్షాలు అల'జడి' సృష్టిస్తున్నాయి.

- గద్వాల, మే 15

చేయకపోవడంతో అకాల వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా రాత్రిపగలు తేడా లేకుండా అకాల వర్షాలు కురుస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు.

గద్వాల జిల్లాలో కొనుగోలు కేంద్రం తూకం కోసం ఉన్న ధాన్యం

**కొనుగోళ్లు ప్రారంభమై 45 రోజులైనా..**

జిల్లాలో యాసంగిలో రైతులు 68,896 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. సుమారు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇందులో మొదటగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు 1.75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. అయితే అందులో కొంత మంది రైతులు దొడ్డు రకం వేయడం, ఇతర ప్రాంతాల్లో ధాన్యం అమ్ముకోవడం, కొనుగోళ్ల లక్ష్యం 1.38లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. కొనుగోళ్ల లక్ష్యం కుదించినప్పటికీ వేగంగా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొనుగోలు సెంటర్ల ద్వారా రైతుల నుంచి 1.38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, కేంద్రాలు ప్రారంభమై 45రోజులు అవుతున్నా ఇప్పటి వరకు జిల్లాలో 69 కొనుగోలు కేంద్రాల ద్వారా 6,900 మంది రైతుల నుంచి కేవలం 47వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. వానకాలం సమీస్తున్నా ఇంకా రైతుల నుంచి సగభాగం ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోళ్లకు సంబంధించి రైతులకు సుమారు రూ.55కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.24కోట్లు మాత్రమే సగభాగం మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా సగం మంది రైతుల ఖాతాల్లో నగదు జమచేయాల్సి ఉన్నది. డబ్బుల జమ కోసం ధాన్యం అమ్మిన రైతులు ఎదురు చూస్తున్నారు.

**వేధిస్తున్న గన్నీ బ్యాగులు, హమాలీల కొరత..**

ధాన్యం కొనుగోళ్లు నత్తనడక సాగడానికి ప్రధాన కారణం గన్నీబ్యాగులు, హమాలీల కొరత ఉన్నట్లు తెలుస్తున్నది. సరైన సమయంలో కేంద్రాలకు గన్నీబ్యాగులు రాకపోవడం, కూలీలు ధాన్యం తూకంపై ఆసక్తి చూపకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తున్నది. దీనికి తోడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఆలస్యం అవుతుండడంతో కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచితే కొనుగోళ్లు వేగవంతంగా జరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వాస్తవంగా జిల్లాకు కొనుగోళ్ల సీజన్ ముగిసే వరకు 19లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా, సరిపడా గన్నీ బ్యాగులు జిల్లాకు రావడం లేదని రైతులు అంటున్నారు. అధికారులు మాత్రం గన్నీ బ్యాగుల కొరత లేదని, కొను గోలు కేంద్రాల్లో అయిపోయిన వెంటనే తెప్పిస్తున్నామని చెబుతున్నారు. కొనుగోళ్లు వేగంగా జరగపోవడానికి గన్నీ బ్యాగుల కొరత కూడా కారణమని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను సందర్శించి వేగవంతం చేసేలా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

### 15రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే..

కొను గోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15రోజేలు అవుతున్నది. ఆరబెట్టి 14శాతం తేమ ఉన్నా కొను గోలు చేయడం లేదు. తరుగు తీయనిదే మిల్లర్లు లారీల్లో ధాన్యం దించుకోవడం లేదు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నాం. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, రైతు, గంగాపూర్

### నాలుగు రోజులైనా బ్యాగులు ఇస్తలేరు..

మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చి నాలుగు రోజులైనా కొనుగోలుకు బ్యాగులు ఇవ్వడం లేదు. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. 9రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నా. వర్షానికి ధాన్యం తడిసిపోతున్నది. అధికారులు స్పందించి గన్నీ బ్యాగులిచ్చి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

- లింగం, రైతు, గొల్లపల్లి గ్రామం

- హైవే-167పై రైతుల రాస్తారోకో
- ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్
- భారీగా నిలిచిపోయిన వాహనాలు

167వ జాతీయర హదారిపైకి వచ్చి రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని తీసుకొచ్చి 15రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు చేయడం లేదని, చెత్త, తేమశాతం పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరబెట్టడం, సాయంత్రం కుప్పవేయడమే సరిపోతుందన్నారు. అకాల వర్షాలకు తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తీసుకెళ్తే కిలో నుంచి రెండు కిలోలు తరుగుతీస్తున్నారని, ఇదేమి అన్యాయమని ప్రశ్నిస్తే మిల్లర్లు లారీల్లో నుంచి ధాన్యాన్ని దించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు రోడ్డుపై నుంచి కదిలేదిలేదని భీష్మించుకుని కూర్చోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎస్సై జయప్రసాద్ ధర్నా వద్దకు చేరుకొని అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

## పడిగాపులు కాస్తున్నా పట్టించుకోరా?

జడ్చర్ల-కల్వకుర్తి జాతీయరహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

జడ్చర్ల, మే 15 : జడ్చర్ల మండలం గంగాపూర్ రోడ్డులోని పత్తి మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు గురువారం జడ్చర్ల-కల్వకర్తి

విద్యుద్దీపకాంతుల్లో మిరుమిట్లుగొల్పుతున్న పిల్లలమర్రి

## ముస్తాబైన పిల్లలమర్రి

- నేడు పాలమూరుకు 22 మంది అందాల భామల రాక
- మహావృక్షంతోపాటు మ్యూజియం, ఆలయం సందర్శన
- పకడ్బందీగా ఏర్పాట్లు • పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు

మహబూబ్‌నగర్, మే 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొంటున్న 22మంది విదేశీ అతిథులు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి పర్యటనకు వస్తుండడంతో జిల్లా అధికార యంత్రాగం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం సాయంత్రం 5గంటలకు పాల మూరుకు విదేశీ అతిథులు చేరుకుంటారు. పాల మూరు సాంప్రదాయం ఉట్టిపడేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కోలాటాలు, డోలు, బతుకమ్మ సాంప్ర దాయ కళాకారులతో ప్రదర్శనలకు సిద్ధం చేశారు. దాదాపు 2గంటలపాటు పిల్లలమర్రి సందర్శన కార్యక్రమానికి 22మంది అతిథుల కోసం ఏకంగా 1,000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేయడం గమనార్హం. మరో 500 మంది వరకు అధికార యంత్రాంగం ఇక్కడే తిష్ట వేసింది. కళాకారులు, సహాయ సిబ్బంది మరో 200మంది వరకు ఉండనున్నారు. అతిథులకు పాలమూరు వంటకాలను రుచి చూపించనున్నారు. కాగా, పిల్లలమర్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేప ట్టారు. అనుమతి లేనిదే ఎవరినీ పిల్లలమర్రికి రానివ్వడం లేదు. కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. గురువారం కలెక్టర్, ఎస్పీతోపాటు అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు, డీఎఫ్‌వో సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో నవీన్, డీఈవో ప్రవీణ్ ఏర్పాట్లను పరిశీలించారు.

సిద్ధమైన ఆలయం, బందోబస్తులో పోలీసులు

**పర్యటన ఇలా..**

22మంది అతిథుల బృందానికి స్వాగతం పలికాక పిల్లలమర్రి మ్యూజియానికి తీసు కెళ్తారు. అక్కడ ఉమ్మడి జిల్లాలో లభించిన వివిధ కళాకృతులను శిలా శాసనాలను చూపిస్తారు. అనంతరం అక్కడే ఉన్న ఆలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత సుమారు మూడున్నర ఎకరాల్లో విస్తరించిన పిల్లలమర్రి మహావృక్షాన్ని చూపిస్తారు. ఈ వృక్షం పుట్టు పూర్వోత్తరాలను వివరిస్తారు. అక్కడి నుంచి భారీ బందో బస్తు మధ్య తిరిగి హైదరా బాడ్‌కు ప్రత్యేక ఎస్కార్ట్ ద్వారా అతిథులు బయలుదేరి వెళ్లనున్నారు.

### 2 గంటల కోసం ఇంత హంగామా?

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్**

రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలను కొనడానికి చేతగాక రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ సర్కారు.. ప్రపంచ సుందరీమణులు పిల్లలమర్రి సందర్శనకు ఎక్కడా లేని హంగామా చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖజానాలో చిల్లి గవ్వలేదంటూనే సుందరీమణుల కోసం రూ.కోట్లు ఎలా ఖర్చు చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం సొంత జిల్లాలో రైతులు ధాన్యం అమ్మడానికి నానా కష్టాలు పడుతుంటే వారిని గాలికొదిలేసి ఆగమేఘాలపై రూ.కోట్లు ఖర్చు చేసి హంగామా చేయడం అవసరమా అని నిలదీశారు. ధాన్యం కొనాలని రోడ్డెక్కితే లాఠీ ఝుళిపించే పోలీసులు కొంతమంది అతిథుల కోసం వెయ్యి మంది రక్షణ ఏర్పాట్లు చేయడం బాధాకరమన్నారు. అనవసరపు ఆర్భాటాలను వదిలేసి కనీసం పదోవంతైనా రైతులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు దృష్టి సారిస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. అకాల వర్షాలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే పది రోజులైనా కొనుగోలు

- సీఎం సొంత నియోజకవర్గంలో ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

## అచ్చంపల్లిలో తాగునీటికి తండ్లాట

మద్దూర్, మే15 : తాగునీటి కోసం సీఎం సొంత నియోజకవర్గంలోనే ప్రజలు తండ్లాడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గం మద్దూర్ మండలంలోని అచ్చంపల్లిలో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. నిధుల లేమితో చేసేది లేక పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో గ్రామంలో అభివృద్ధి మాట అటుంచితే కనీసం తాగడానికి మంచినీళ్లు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం మద్దూరు ఎంపీడీవో నర్సింహా డ్డికి గ్రామస్తులు కిచ్చిసాయప్ప, అంజి, గోవిందు తదితరులు తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కాగా, గ్రామానికి చెందిన ఊషప్ప సొంత ఖర్చులో ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

## శ్రీస్వామినారాయణ్ గురుకుల్ విజయోత్సవ ర్యాలీ

- జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం

జడ్చర్ల టౌన్, మే 15 : పదోతరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో జడ్చర్లలోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించడంతో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి జడ్చర్ల పట్టణ ప్రధాన రహదారుల మీదుగా మహబూబ్‌నగర్, భూత్పూర్ వరకు విజయోత్సవ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ స్థాయిలో 500 మార్కులకు గానూ 494 మార్కులతో 5వ ర్యాంకును సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఇషాంక్ భరత్వాల్‌తోపాటు 91శాతం ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తున్న శ్రీస్వామి నారాయణ్ గురుకుల్ పాఠశాల విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ చాటేలా శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇందుకు నిదర్శనంగా జాతీయస్థాయిలో పాఠశాల విద్యార్థి 5వ ర్యాంక్ సాధించడమేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు సర్వదర్శన్ దాస్‌జీ స్వామిజీ, దర్శన్ ప్రియదాస్‌జీ స్వామిజీ, ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ప్రతినిధులు

## అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదు

- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల డోల్ల ప్రాజెక్ట్
- అవగాహన లేకుండానే నిర్మాణానికి రెడీ
- అనుమతుల్లేవు అప్పుడే రూ.100కోట్ల బిల్లులకు ప్రతిపాదనలు
- దోచుకోవడమే ప్రజాపాలనా?
- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, మే 15 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం మక్తల్, నారాయణపేట ప్రజలకు అన్యాయం చేస్తామంటే సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డిని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మక్తల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిట్టెం మాట్లాడారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ నియోజకవర్గానికి నీటిని ఏ విధంగా తీసుకొస్తారో రేవంత్‌రెడ్డి బహిరంగంగా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్థమయ్యేలా వివరించాలన్నారు. భూత్పూర్ రిజర్వాయర్ 1.3 టీఎంసీల సామర్థ్యం ఉండగా, 90కిలోమీటర్ల పైపులైన్ ద్వారా కొడంగల్‌కు ఒక టీఎంసీ నీటిని ఏ విధంగా తీసుకెళ్తారో చెప్పాలన్నారు. డీపీవో రిపోర్టు, ఫారెస్ట్ క్లియరెన్స్, భూ సేకరణ, కృష్ణ బోర్డు నుంచి అనుమతులు లేకుండా ప్రాజెక్టు ఏ విధంగా చేపడుతారని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండర్లు దక్కించుకున్న విషయం రాష్ట్రమంతా తెలుసని, ప్రాజెక్టు పనులు ప్రారంభం కాక ముందే పైపుల నిర్మాణం చేపట్టకుంటూ రూ.100కోట్ల బిల్లు ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. భూసేకరణ కోసం అధికారులు పోలీస్ బలగాలను తీసుకెళ్లి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తే తప్పా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించబోమని హెచ్చరించారు. నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు వల్ల మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాలకు సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని, భూత్పూర్ రిజర్వాయర్‌లో చుక్క నీరు లేకుండా కొడంగల్ నియోజకవర్గానికి నీటిని ఎలా తరలిస్తారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. చిన్న గోప్లా పుల్ పంప్‌హౌస్ వద్ద నీటిని ఎత్తిపోసేందుకు మూడు మోటర్లను అమర్చడం జరిగిందని, దివంగత చిట్టెం నర్సిరెడ్డి ముందుచూపుతో స్టేజ్-1 పంప్‌హౌస్‌లో స్టాండ్ బై పంప్ అమర్చి భవిష్యత్‌లో మోటర్ల రిపేరుకు ఇబ్బంది లేకుండా నీటిని పంపించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. రిజర్వాయర్లపై ఎలాంటి అవగాహన లేని సీఎం, ఎమ్మెల్యేలు నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపడుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొడంగల్‌కు నీటిని తీసుకెళ్లే ముందు మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు ఏవిధంగా సాగునీళ్లు ఇస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేయాలను కుంటే పక్కనే ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలే తప్పా మక్తల్ నియోజకవర్గం నుంచి నీటిని ఎలా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తారని మండిపడ్డారు. నారాయణపేట, మక్తల్‌కు అన్యాయం చేయాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీలు అరవింద్, అశోక్‌గౌడ్, నర్వ మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, నాయకులు అన్వర్ హుస్సేన్, గాల్‌రెడ్డి, శంకర్, నర్సింహారెడ్డి, కృష్ణ, మన్నన్, సాగర్, శివారెడ్డి, అశోక్‌గౌడ్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నల్లమలలో కనిపించిన బిట్టు ఉడుత

## ఉడుత ఉడుత ఊచ్..

- నల్లమలలో బ్యూటిఫుల్ బిట్టు ఉడుత
- ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రత్యక్షం

అచ్చంపేట, మే 15 : ప్రకృతి అందాలకు నెలవైన నల్లమల అడవుల్లో బ్యూటిఫుల్ బిట్టు ఉడుత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. ఆసక్తికరమైన ఈ అందాల ఉడుత ప్రకృతి ప్రేమికులు, వన్యప్రాణి పరిశోధకులను ఆకట్టుకుంటున్నది. ఆకర్షణీయమైన రంగులు, అసాధారణ పరిమాణం, చెట్లపై చురుకైన కదిలికలతో ప్రత్యేకతను చాటుకుంటున్నది.

**శరీర నిర్మాణ విశేషాలు**

బిట్టు ఉడుత పరిమాణం 25-40 సెం.మీ.వరకు ఉంటుంది. తోక పొడవుగా, దట్టంగా కనిపిస్తోంది. ఊదా, గోధుమ, బూడిద రంగుల మిశ్రమంతో ఈ ఉడుత ఆకర్షణీయంగా కనబడుతున్నది. ముదురు నలుపు, బూడిద రంగుతో కూడిన తోక ఉంటుంది. పెద్ద ఉడుత జాతికి చెందిన ఉడుతగా చెబుతున్నారు.

**చెట్లపై జీవించే వృక్షవాసి..**

ఈ వన్యప్రాణి చెట్లపై జీవించే వృక్షవాసి. పగటిపూట చురుకుగా సంచరిస్తూ చెట్ల మధ్య వేగంగా దూకుతున్నది. ఆకులు, పండ్లు, పువ్వులు, విత్తనాలు, చిన్న, చిన్న పురుగులు తింటూ జీవిస్తుంది. బిట్టు ఉడుతలు చాలా అరుదుగా కనిపిస్తాయి. దేశపు వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఈ జాతి రక్షిత జీవిగా చేర్చబడింది. నల్లమల అడవుల్లో దీని ఉనికి వన్యప్రాణి జీవ వైద్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొంటారు. అడవుల పర్యావరణ సమతుల్యతకు ఈ ఉడుత ముఖ్యమైన భాగం. పర్యాటకులను ఆకర్షించే ఈ జంతువు ప్రకృతిలో ఆకట్టుకునే అందాన్ని మరింత వెలుగులోకి తెస్తోంది. నల్లమలలో వన్యప్రాణుల ఉనికి జీవవైవిధ్యానికి బలమైన గుర్తింపుగా చెప్పవచ్చు.

**ఉమామహేశ్వరంలో దర్శనం**

నల్లమల ప్రాంతంలోని ఉమామహేశ్వరం ఆలయంలో భక్తులకు బిట్టు ఉడుత దర్శనమిచ్చింది. ఆ ప్రాంతంలో దాదాపు 6 వరకు ఈ జాతి ఉడుతలు ఉన్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఆలయం ఎదుట ఉన్న చెట్టు నుంచి కిందికి దిగిన బిట్టు ఉడుతకు మొదట ఆలయ సిబ్బంది కొబ్బరి చిప్పను అందివ్వగా తీసుకొని తిరిగి చెట్టు పైకి వెళ్లిపోయింది. తరుచుగా చెట్టుపై నుంచి బిట్టు ఉడుత కొబ్బరి చిప్పకోసం కిందికి వస్తుందని, ఇచ్చిన వెంటనే తీసుకొని చెట్టుపైకి వెళ్లి పోతుందని ఆలయ సిబ్బంది తెలిపారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## ప్రతి పల్లె అభివృద్ధి చెందాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, మే 15 : నియోజకవర్గంలోని ప్రతి పల్లె అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో రూ.95 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలం పూర్, అయిజ, ఉండవెల్లి, ఇటిక్యాల, మానవపాడు, వడ్డేపల్లి, రాజోలి, ఎర్రవల్లి మండలాలకు చెందిన 70 మంది లబ్ధిదారులకు రూ.70,08,120ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 102 మంది బాధితులకు రూ.25,88,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు వెల్లడించారు.